సాక్షి నంద్యాల

సోమవారం । 15 । జూలై । 2024



శాస్త్రోక్తంగా ఆలయ శుద్ధి

మహానంది: మనగుడి, మన ఊరు, మన బాధ్యత నినాదంతో సుమారు 200 మంది సేవకులు, భక్తులు ఆదివారం మహానంది ఆలయ శుద్ధి కార్యక్రమం చేపట్టారు.



నీలకంఠుడికి నృత్య నివేదన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన నటరాజ నృత్య కళాపీఠం వారి పేరిణి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,607.5
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 32.5
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 14,560
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 203

న్యూస్‌రీల్

శ్రీగిరికి పోటెత్తిన భక్తులు



మల్లన్న దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన పరమేశ్వరుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజామున్నే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి బారులుదీరారు. ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు మల్లన్నకు గర్భాలయ, సామూహిక అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సర్వ దర్శనానికి 4గంటలు, శీఘ్ర దర్శనానికి 3గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన అధికారులు పలు ఏర్పాట్లు చేశారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.

శ్రీశైల దేవస్థానానికి రూ. 3 లక్షల విరాళం



అన్నదాన పథకానికి విరాళాన్ని అందిస్తున్న కర్నూలుకు చెందిన బి.లక్ష్మమ్మ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న పలు సేవా పథకాలకు ముగ్గురు భక్తులు విరాళాలు అందించారు. నిత్యాన్న పథకానికి కర్నూలుకు చెందిన బి.లక్ష్మమ్మ రూ.1,00,001, నాగర్‌కర్నూలుకు చెందిన జి.అశోక్‌కుమార్ రూ.1,01,116, గో సంరక్షణ పథకానికి గుంటూరుకు చెందిన పాలిశెట్టి ఆనంద్ గోపిసాయి కృష్ణ రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు. విరాళాలను అందించిన దాతలను దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.

'వైల్డ్ విజన్ గ్లోబల్ చాలెంజ్'కు రిజిస్ట్రేషన్ చేసుకోండి

నంద్యాల(న్యూటౌన్): అడవులు, జీవవైద్యం, వన్యప్రాణులపై అవగాహన కల్పించేందుకు వైల్డ్ విజన్ గ్లోబల్ చాలెంజ్ నిర్వహిస్తున్న కార్యక్రమానికి విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. ప్రకృతి పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందన్నారు. అర్హత ఉన్న విద్యార్థులు www.academy.wwfindia.orf/widwirdom వెబ్‌సైట్‌లో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.

- కరువు రైతుకు ఇప్పటి వరకు అందని పరిహారం
- మార్చిలో ఉమ్మడి జిల్లాలో 30 కరువు మండలాల గుర్తింపు
- కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్రబృందం పర్యటన
- అందాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ రూ.96.05 కోట్లు
- వైఎస్సార్‌సీపీ హయాంలో నెలలోపే ఇన్‌పుట్ సబ్సిడీ
- టీడీపీ పాలనలో ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలలో అంతులేని జాప్యం



వానల్లేక రబీలో ఎండిపోయిన శనగ (ఫైల్)

ఎదురు చూపులు.. ఎండమావులు!

కర్నూలు(అగ్రికల్చర్): రబీలో నష్టపోయిన కరువు రైతుకు ఇప్పటి వరకు పరిహారం అందలేదు. కేంద్రం బృందం పర్యటించి వెళ్లినా టీడీపీ కూటమి ప్రభుత్వంలో చలనం రావడం లేదు. అన్నదాతలపై కనికరం చూపడం లేదు. గతంలో వైఎస్సార్‌సీపీ హయాంలో అధిక వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లితే కేవలం నెల రోజుల్లోనే ఇన్‌పుట్ సబ్సిడీ అందేది. కరువుతో నష్టం వాటిల్లితే ఎన్యూమరేషన్ చేపట్టి, నివేదిక అందిన వెంటనే రైతుల బ్యాంకు ఖాతాలకు డీబీటీ ద్వారా ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించడం ఆనవాయితీగా ఉండేది. దీంతో రైతులు ఉత్సాహంగా వ్యవసాయం చేసేవారు. నేడు పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.



ఆది నుంచి అంతే..

టీడీపీ పాలనలో రైతులకు ఎప్పుడూ న్యాయం జరగలేదు. 2014–15 నుంచి 2018–19 మధ్య టీడీపీ పాలనా కాలంలో వరుసగా నాలుగేళ్లు కరువు వచ్చింది. ఏ సంవత్సరం కూడా అదే వ్యవసాయ సీజన్‌లో ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేసిన దాఖలాలు లేవు. 2014 ఖరీఫ్‌లో కరువు మండలాలను ప్రకటిస్తే 2016లో ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలైంది. 2017–18లో ఖరీఫ్, రబీ సీజన్‌లలో కరువు మండలాలను ప్రకటించినప్పటికీ 2019 ఏప్రిల్ వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించలేదు. ప్రస్తుతం ఇదే పంథాను అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఇదీ పరిస్థితి...

గతేడాది వర్షాభావంతో ఖరీఫ్‌లో పంటలు దెబ్బతిన్నాయి. అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కర్నూలు జిల్లాలో 24, నంద్యాల జిల్లాలో ఆరు మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించింది. ఎన్యూమరేషన్ చేయించి ఇన్‌పుట్ సబ్సిడీని మార్చి 5న రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదల చేసింది. 2023–24 రబీ సీజన్‌పై కూడా వర్షాభావం ప్రభావం చూపడంతో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో మార్చి 15న కర్నూలు జిల్లాలో 18, నంద్యాల జిల్లాలో 12 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో ఎన్యూమరేషన్ ప్రక్రియ జరగలేదు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం ఈ–క్రాప్ డేటా ఆదారంగా ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ మార్గదర్శకాల ప్రకారం ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ఆయా జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదికలు పంపాయి. కాని ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల ఎప్పుడనేది ప్రశ్నార్థకంగా మారింది. రబీ కరువు మండలాల్లో ముగ్గురు ఉన్నతాధికారులతో కేంద్రబృందం కూడా జూన్ 19, 20 తేదీల్లో ఉమ్మడి జిల్లాలో పర్యటించింది. కేంద్రానికి నివేదిక కూడా ఇచ్చింది. ఉమ్మడి జిల్లాకు రూ.163.85 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల కావాల్సి ఉంది.

రబీలో కరువు మండలాలు ఇవీ..	
	కర్నూలు జిల్లా: ఆదోని, ఆలూరు, ఆస్పరి, సి.బెళగల్, చిప్పగిరి, గూడూరు, హాలహర్వి, హొళగుంద, కల్లూరు, కోడుమూరు, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, మద్దికెర, మంత్రాలయం, పత్తికొండ, తుగ్గలి, వెల్దుర్తి, ఓర్వకల్లు
	నంద్యాల జిల్లా: ఆళ్లగడ్డ, గోస్పాడు, గడివేముల, బనగానపల్లె, ఉయ్యాలవాడ, సంజామల, అవుకు, నందికొట్కూరు, మిడుతూరు, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, దొర్నిపాడు, నంద్యాల

నష్టపోయిన రైతులు	నష్టం జిల్లాల వారీగా..
కర్నూలు జిల్లా: 54,382	కర్నూలు జిల్లా: రూ.58.28 కోట్లు
నంద్యాల జిల్లా: 37,208	నంద్యాల జిల్లా: రూ.37.76 కోట్లు

దెబ్బతిన్న పంటల వివరాలు..	
	కర్నూలు జిల్లాలో శనగ 36,166, జొన్న 9,144, కొర్ర 1,085, మొక్కజొన్న 1,537, పొగాకు 2,088, వేరుశనగ 2,693, వరి 266, మినుము 763, సజ్జ 273 హెక్టార్లలో దెబ్బతిన్నాయి.
	నంద్యాల జిల్లాలో శనగ 25005.43 , మినుము 2,622.31, జొన్న 8,441.12 హెక్టార్ల ప్రకారం దెబ్బతిన్నాయి.

రైతు పరిస్థితి దయనీయం..

ప్రస్తుతం రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. 20 రోజులుగా వర్షాలు లేకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయి. ప్రభుత్వం నుంచి చేయూత కరువైంది. 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 49,890 మంది రైతులకు రూ.67.80 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ పెండింగ్‌లో ఉంది. బ్యాంకు ఖాతాలు పనిచేయకపోవడం, ఫెయిల్యూర్స్ వంటి కారణాలతో ఈ రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల కాలేదు. జిల్లా వ్యవసాయ శాఖ ఖాతాలను సరిచేసి ప్రభుత్వానికి పంపింది. ఇప్పటి వరకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల కాలేదు. రబీ కరువు మండలాలకు సంబంధించి రూ.96.05 కోట్లు, ఖరీఫ్ కరువు మండలాలకు సంబంధించి రూ.67.80 కోట్లు...మొత్తంగా రూ.163.85 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల కావాల్సి ఉంది. ఒకవైపు అనావృష్టి, మరోవైపు పెట్టుబడి కష్టాల్లో ఉన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల అవసరం ఎంతో ఉంది.

పెట్టుబడి మట్టిపాలైంది



పోయిన ఏడాది రబీలో మేం ఏడు ఎకరాల్లో ముందుగా ఉల్లి సాగు చేశాం. అది దెబ్బతినడంతో నాలుగు ఎకరాల్లో జొన్న , మరో మూడు ఎకరాల్లో శనగ వేశాం. వానల్లేక పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎకరాకు 50 కిలోల దిగుబడి కూడా రాలేదు. తీవ్రంగా నష్టపోయాం. పెట్టుబడి అంతా మట్టిపాలైంది. మార్చిలోనే మా మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించారు. ఇటీవల కేంద్ర బృందం కూడా పర్యటించింది. అయితే ఇప్పటి వరకు కరువు పరిహారం అందలేదు. – ప్రహ్లాదరెడ్డి, రైతు, తుగ్గలి

కోలుకోలేని విధంగా నష్టపోయాం



మేం రబీలో ఆరు ఎకరాల్లో శనగ, నాలుగు ఎకరాల్లో పొగాకు వేశాం. మరో 2.50 ఎకరాలు కౌలుకు తీసుకొని పొగాకు సాగు చేశాం. వానల్లేక పంటలు సరిగ్గా పండలేదు. ఆరు ఎకరాల్లో శనగ సాగు చేస్తే క్వింటా కూడా దిగుబడి రాలేదు. కోలుకోలేని విధంగా నష్టపోయాం. గత ప్రభుత్వం పంట నష్టపోయిన వెంటనే పరిహారం అందించేది. ఇప్పుడు ప్రభుత్వం మారింది. కరువు రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించి ఆదుకోవాలి.

– సర్వేశ్వరరెడ్డి, లక్ష్మీపురం, కల్లూరు మండలం

దర్యాప్తు మళ్లీ మొదటికి!

- మిస్టరీ వీడని బాలిక అదృశ్యం కేసు
- ఆధారాల కోసం మళ్లీ డాగ్ స్క్వాడ్‌తో గాలింపు
- పోలీసుల అదుపులో మరో అనుమానితుడు
- నిందితులను రహస్యంగా విచారిస్తున్న డీఐజీ, ఎస్పీ



ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్ వైపు వెళ్తున్న డాగ్ స్క్వాడ్ బృందం



డీఐజీకి వినతిపత్రం ఇస్తున్న బీసీ నాయకులు

పగిడ్యాల/జూపాడుబంగ్లా: ముచ్చుమర్రి పంచాయతీ పరిధిలోని ఎల్లాల గ్రామానికి చెందిన బాలిక అదృశ్యం కేసు దర్యాప్తు మళ్లీ మొదటికొచ్చింది. అనుమానిత నిందితుల సమాచారం మేరకు కృష్ణానది తీర ప్రాంతాన్ని ఎనిమిది రోజులుగా జల్లెడ పడుతున్నా పోలీసులకు బాలిక ఆచూకీ లభించడం లేదు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో ముచ్చుమర్రి పంప్‌హౌస్, అప్రోచ్ చానెల్, పాత ఎల్లాల తిప్పను గాలించినా చిన్న ఆధారం కూడా కనిపించ లేదు. ఓ వైపు బాలిక కేసు మిస్టరీ వీడక పోవడంతో గ్రామస్తులు, బాలిక కుటుంబీకులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు పోలీసులు ఈ కేసు దర్యాప్తును మళ్లీ మొదటి నుంచి ప్రారంభించారు. ఆదివారం మళ్లీ డాగ్ స్క్వాడ్‌ను రప్పించి గ్రామంలోని పార్క్ నుంచి దర్యాప్తును చేపట్టారు. వర్షం కురవడంతో గాలింపునకు అంతరాయం ఏర్పడింది. అలాగే సీఐ నాగరాజరావు పాత ముచ్చుమర్రి పార్క్ వద్ద బస్సు ప్రాంగణం వద్ద నిలిపే ఆటో డ్రైవర్ల వివరాలు తెలుసుకుని ఒక్కొక్కరిని పిలిచి విచారిస్తున్నారు. అనుమానిత నిందితులను జూపాడు బంగ్లా పోలీసు స్టేషన్‌లో ఉంచి డీఐజీ విజయరావు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి అక్కడే మకాం వేసి విచారణ చేస్తున్నారు. స్టేషన్‌లోకి ఎవరినీ పంపకుండా, విచారణ విషయాలు బయటకు పొక్కనీయకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ కేసులో మొదట ముగ్గురు బాలుర్లను అదుపులోకి తీసుకోగా తాజాగా మరో బాలుడిని విచారిస్తున్నట్లు సమాచారం. అరెస్ట్‌కు ముందు నిందితులు, వారి కుటుంబీకులు ఫోన్‌లో ఎవరితో ఎక్కువగా మాట్లాడారనే విషయాలపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

అదృశ్యమైన బాలిక ఆచూకీ తేల్చండి

కర్నూలు: బాలిక ఆచూకీ తేల్చాలని బీసీ, వాల్మీకి సంఘాల ప్రతినిధుల బృందం ఆదివారం కర్నూలు రేంజ్ డిఐజీ విజయరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవపూజ ధనుంజయ ఆచారి, వాల్మీకి సంఘం నాయకులు శ్రీనివాసులు నాయుడు, బాల సంజన్న తదితరులు డీఐజీని కలిసి సమస్యను వివరించారు.

కూటమి ప్రభుత్వం నమ్మక ద్రోహం



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం జీపీఎస్‌ను అమలు చేస్తూ రాజ పత్రాన్ని విడుదల చేయడం నమ్మక ద్రోహమని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి విమర్శించారు. ఈ నెల 12వ తేదీన ప్రభుత్వం విడుదల చేసిన జీపీఎస్ గెజిట్‌ను నిలిపివేయాలని కోరుతూ యూటీఎఫ్ డోన్ డివిజన్ అధ్యక్షుడు గోపాలు ఆధ్వర్యంలో పాత బస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించడం దారుణమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. లేని పక్షంలో మరో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం జీపీఎస్ గెజిట్ ప్రతులను వారు దహనం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ప్రసాద్‌రెడ్డి, సంజీవరెడ్డి, చంద్రమోహన్, అంజనప్ప, రాజకుళ్ళాయప్ప, రామ్మూర్తి, ప్రసాద్, నాగాంజనేయులు, సంజీవరాయుడు, రమేష్‌నాయుడు, సాలయ్య పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయండి

నంద్యాల(న్యూటౌన్): నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు 2023 డిసెంబర్‌లో జరిగిన పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులు ఆగస్టు 31లోగా నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మార్పులు చేసిన నూతన హోం పేజీ, నూతన మొబైల్ యాప్, అప్‌డేట్ చేసిన వెబ్ వర్షన్‌తో వన్‌టైం రిజిస్ట్రేషన్ అప్లికేషన్ ప్రారంభించారన్నారు. వన్‌టైం రిజిస్ట్రేషన్ కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. స్కాలర్‌షిప్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 15లోగా స్కూల్ నోడల్ ఆఫీసర్, సెప్టెంబర్ 30వ తేదీలోగా జిల్లా నోడల్ ఆఫీసర్ వాటిని ఆమోదించాలన్నారు. మిస్ మ్యాచ్ వివరాలను విద్యార్థులు సరి చేయించుకోవాలన్నారు. బ్యాంకు ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేయించుకుంటే డీబీటీ ద్వారా డబ్బులు జమ అవుతాయన్నారు.

ఆందోళనలో అధ్యాపకులు



పాఠాలు బోధిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్

- కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్ల రెన్యూవల్‌లో సందిగ్ధం
- స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- మే, జూన్ జీతాలు అందని వైనం

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ అలసత్వంతో జూనియర్ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్లు అయోమయంలో పడ్డారు. 2023–24 విద్యా సంవత్సరం కాల పరిమితి ఏప్రిల్ నాటికి పూర్తయింది. 2024–25కి సంబంధించి రెన్యూవల్ చేయాల్సి ఉంది. కొత్త ప్రభుత్వం ఈ విషయం గురించి ఇప్పటి పట్టించుకోలేదు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 27 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. వీటి పరిధిలో 140 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు పని చేస్తున్నారు. ఈ ఏడాది మేలో ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. తర్వాత ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల విధులు, ఆ తర్వాత ఆన్‌లైన్ మూల్యాంకనంలో పాల్గొన్నారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల అడ్మిషన్ల డ్రైవ్ కూడా నిర్వహించారు. జూన్ 1 నుంచి కళాశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఆ రోజు నుంచి కళాశాలల్లో తరగతులు బోధిస్తున్నారు. మే, జూన్ రెండు నెలలూ పూర్తిగా పని చేశారు. కానీ ఇప్పటిదాకా జీతాలు మంజూరు చేయలేదు. 2019 జనవరిలో అప్పటి సీఎం చంద్రబాబు కాంట్రాక్ట్ లెక్చరర్లకు రూ.27 వేల నుంచి రూ.37,100కు వేతనం పెంచారు. అయితే ఏప్రిల్ నుంచి అమలయ్యేలా జీఓ ఇచ్చారు. తర్వాత ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చింది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాగానే జీతాల పెంపు జీఓను అమలు చేశారు. మూడేళ్ల క్రితం పీఆర్సీ ఇచ్చిన సమయంలో ఏకంగా రూ.57,100 వేతనం చేశారు. దీంతో వైఎస్ జగన్ ఫొటోలకు కాంట్రాక్ట్ లెక్చరర్లు క్షీరాభిషేకం చేశారు. కాంట్రాక్ట్ లెక్చరర్లందరూ జగన్‌కు మద్దతుగా ఉన్నారనే కారణంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు చేపడుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్ట్ గడువు ముగిసినా రెన్యూవల్ చేయడంలో జాప్యం చేస్తూ ఆందోళనకు గురి చేస్తుందని తెలుస్తోంది.

ప్రభుత్వం న్యాయం చేయాలి



రెండు నెలలుగా జీతాల రాక పోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. మే, జూన్ నెలంతా పని చేశాం. రెన్యూవల్ కాక పోవడంతో జీతాలు బిల్లు చేయడం లేదు. కుటుంబాల నిర్వహణ ఇబ్బందిగా మారింది. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా బోధన సాగిస్తున్నాం. ప్రభుత్వం స్పందించి వెంటనే రెన్యూవల్ చేసి జీతాలు మంజూరయ్యేలా చూడాలి.

– కిశోర్‌కుమార్, కాంట్రాక్ట్ అధ్యాపకుల అసోసియేషన్, జనరల్ సెక్రటరీ, నంద్యాల

రెగ్యులర్ ఉత్తర్వులు ఇవ్వాలి



గత ప్రభుత్వ హయాంలో చట్ట ప్రకారం కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేసేలా చర్యలు తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా 3,600 మందికి గాను 1,700 మంది జూనియర్ అధ్యాపకులు రెగ్యులర్‌కు అర్హత సాధించారు. వారందరికీ వెంటనే క్రమబద్ధీకరణ ఉత్తర్వులు ఇవ్వాలి.

– గాంధీ, కాంట్రాక్ట్ అధ్యాపకుల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, నంద్యాల

టీడీపీ నాయకుని బరి తెగింపు

- కాల్వ గట్టు దర్జాగా కబ్జా
- పొలానికి దారి లేక రైతుల అవస్థలు
- ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం



ఆక్రమణకు గురైన కాల్వ గట్టు ఇదే



మిట్నాల వైపు వచ్చే కేసీ కెనాల్ సబ్ చానల్

నంద్యాల(అర్బన్): టీడీపీ నాయకుల దౌర్జన్యాలు, దాడులు, దురాక్రమణలు రోజురోజుకు శృతి మించుతున్నాయి. ప్రభుత్వ ఆస్తులపై కన్నేసిన తెలుగు దేశం పార్టీ నాయకులు తమ పార్టీ అధికారంలోకి రావడంతో దర్జాగా కబ్జాకు పాల్పడుతున్నారు. చెట్లు, పుట్టలు, ఇసుకతో పాటు కాల్వ గట్లను ఆక్రమిస్తున్నారు. ఇది అన్యాయమని ప్రశ్నిస్తే బడా నాయకులతో బెదిరింపులకు దిగుతున్నారు. తామేమి చేయలేమంటూ రెవెన్యూ అధికారులు చేతులెత్తేయడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. నంద్యాల మండలం మిట్నాల గ్రామ సమీపంలోని కేసీ కాల్వ వద్ద సర్వే నెంబర్ 174, 175లో దాదాపు నలుగురు రైతులకు సంబంధించి 26 ఎకరాల సాగుభూమి ఉంది. వీటికి ప్రధాన కాల్వ ద్వారా సాగునీరు అందేందుకు పిల్ల కాల్వ ఉంది. ఆ కాల్వ గట్టు మీదుగా రైతులు బండ్లు, ఎద్దుల కాండ్లు వెళ్లేందుకు దారి కూడా ఉంది. అయితే ఆ సర్వే నెంబర్లలోనే అధికార పార్టీ నాయకుడి పొలం కూడా ఉండటంతో కాల్వ వెంబడి ఉన్న పోరంబోకు స్థలాన్ని ఆక్రమించాడు. గట్టు వెంబడి ఎవరూ రాకుండా రహదారిని చదును చేశాడు. ఇదేమని నిలదీస్తే పోలీసులను పురామాయించడం, అధికార పార్టీ పెద్దలతో బెదిరింపులకు దిగుతున్నాడని బాధిత రైతులు వాపోతున్నారు.

ఏడాదిగా కబ్జాకు యత్నం..

కాల్వ గట్టున ఉన్న పోరంబోకు స్థలాన్ని గత ఏడాది టీడీపీ నాయకుడు ఆక్రమణ విషయాన్ని రైతులు కేసీ కెనాల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కేసీ కెనాల్, రెవెన్యూ అధికారులు కొలతలు వేసి పిల్ల కాల్వ గట్టు వెంట 13 అడుగుల మేర పోరంబోకు స్థలం రస్తా ఉందని తేల్చారు. ఆర్ఎస్ఆర్, అడంగల్‌లలో సైతం గట్టు వెంట రస్తా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గట్టు వద్ద వేసిన కంచెను తొలగించి రస్తాను ఉపయోగించుకోవచ్చని అధికారులు రైతులకు సూచించారు. దీంతో బాధిత రైతులు రహదారి వెంట గ్రావెల్ వేసి రహదారిని ఏర్పాటు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీ నాయకులు గ్రావెల్‌ను తొలగించాడు. బాధిత రైతులు టీడీపీ నాయకుడిని నిలువరించగా.. 'ఆ దారిలో ఎవరొస్తారో చూస్తా. ఎవరైనా వస్తే అంతు చూస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారని రైతులు వాపోతున్నారు.

ఫిర్యాదు చేసినా చర్యల్లేవ్

అధికార పార్టీ నాయకుల ఆక్రమణలను పోలీసులు, రెవెన్యూ అధికారులకు వివరించినా పైస్థాయి ఒత్తిళ్ల అధికం కావడంతో తామేమి చేయలేమంటూ చేతులెత్తేశారని బాధిత రైతులు గోపాల్‌రెడ్డి, చిన్నరామిరెడ్డి, బోయ నరసింహులు, బోయ శివరామయ్యలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకొని తమ పొలాలకు రస్తా చూపాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన సభ్యులను సత్కరిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

కర్నూలు (టౌన్): ఏపీ పీఈటీ, ఎస్‌ఎపీఈ అసోసియేషన్ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా పీఈటీల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం అసోసియేషన్ జిల్లా కమిటీ నూతన అధ్యక్షుడిగా జోసఫ్ లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా చందునాయక్, కోశాధికారిగా శ్రీనివాసులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ జిల్లాలో వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర సంఘం సభ్యులు ఖలీల్ అహమ్మద్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కిషోర్, జిల్లా స్కూల్‌గేమ్స్ అసిస్టెంట్ కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లకు అదనపు జనరల్ బోగీలు

నంద్యాల(సిటీ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు జనరల్ బోగీలను ఏర్పాటు చేస్తున్నట్లు జెడ్‌ఆర్‌యూసీసీ (జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ) సభ్యుడు ఎస్‌ఎండీ జుబైర్ బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ నెల నుంచి 18463/64 ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఒక జనరల్ కోచ్, నవంబర్ 12వ తేదీ నుంచి 17211/17212 కొండవీడు ఎక్స్‌ప్రెస్ లో రెండు అదనపు జనరల్ బోగీలు, ఈనెల 14వ తేదీ నుంచి 17215/17216 మచిలీపట్నం-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలులో ఒక అదనపు జనరల్ కోచ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్పీ కృష్ణకాంత్‌కు ఆత్మీయ వీడ్కోలు

కర్నూలు: నెల్లూరు జిల్లాకు ఎస్పీగా బదిలీపై వెళుతున్న కృష్ణకాంత్‌కు జిల్లా పోలీసు శాఖ తరఫున ఆదివారం రాత్రి ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో పాటు అడిషనల్ ఎస్పీలు, వివిధ విభాగాల పోలీసు అధికారులు కార్యక్రమానికి హాజరై కృష్ణకాంత్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు ఎస్పీగా కృష్ణకాంత్ అందించిన సేవలను కొనియాడారు. అనంతరం కృష్ణకాంత్ కుటుంబ సభ్యులను సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు.

మట్టి తరలింపు అడ్డగింత



మట్టి తరలింపును అడ్డుకునేందుకు వెళ్తున్న పిక్కిలివానిపల్లె గ్రామస్తులు

వెల్దుర్తి(కృష్ణగిరి): అధికార పార్టీ నాయకుల అండతో చెరువు మట్టిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకోవాలనుకున్నా ఇటుకల బట్టీల వ్యాపారులకు చుక్కెదురైంది. మండల పరిధిలోని పిక్కిలివానిపల్లె గ్రామ శివారులోని చెరువు మట్టిని తరలించేందుకు ఆదివారం ప్రొక్లెయిన్‌తోపాటు టిప్పర్‌లను తీసుకుని వచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చెరువు మట్టిని ఎలా తీసుకెళ్తారని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సునీల్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. గ్రామస్తులు ససేమిరా అనడంతో చేసేదేమీ లేక వెనుతిరిగినట్లు తెలిసింది. ఈ మట్టిని తరలిస్తే అధికార పార్టీ చెందిన ఓ నాయకునికి టిప్పర్ల ప్రకారం కమీషన్ ఇచ్చేలా మాట్లాడుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అపర బ్రహ్మలు!

- ప్లాస్టిక్ సర్జరీలో విప్లవాత్మక మార్పులు
- దెబ్బతిన్న శరీర భాగాల స్థానంలో సర్జరీతో యథాస్థితి
- పెద్దాసుపత్రిలో ఆధునిక పరికరాలతో వైద్యం
- పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ సర్జరీ విభాగం
- ఏడాది క్రితం పీజీ సీట్లు మంజూరు
- నేడు జాతీయ ప్లాస్టిక్ సర్జరీ డే

పాత జానపద సినిమాల్లో మాంత్రికులు విరిగిన శరీర భాగాలను వారి మంత్ర తంత్రాలతో అతికించడం చూశాం. ఇప్పటికీ అవి టీవీల్లో సినిమాలుగా వస్తే చూస్తున్నాం. అప్పట్లో ఇదెలా సాధ్యం అని ముక్కున వేలేసుకున్నారు. అవి మంత్రతంత్రాల వల్లనేమో అని సర్దిపుచ్చుకున్నారు. ఇప్పుడు మంత్రాలు తంత్రాలు లేకుండా అత్యాధునిక వైద్యపరికరాలు, విజ్ఞానంతో వాటిని నిజం చేస్తున్నారు అపర బ్రహ్మలు. తెగిన శరీర భాగాలను సరైన సమయంలో తీసుకొస్తే వాటిని అతికిస్తున్నారు. అంధవికారంగా ఉన్న శరీరాకృతిని మార్చి సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆధునిక వైద్య విజ్ఞానంతో ఇదంతా సాధ్యమవుతోంది. ఎంతో సూక్ష్మమైన నాడులను సైతం మైక్రోస్కోప్‌ల సహాయంతో అతికించి ప్రాణాలు పోస్తున్నారు. నేడు జాతీయ ప్లాస్టిక్ సర్జరీ దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు(హాస్పిటల్): ప్లాస్టిక్ సర్జరీ అంటే చాలా మంది ప్లాస్టిక్‌తో చేసే సర్జరీ అనే భావనలో ఉంటారు. కానీ నిజానికి దాని అర్థం అది కాదు. ప్లాస్టిక్ సర్జరీలోని ప్లాస్టిక్ అనేది ప్లాస్టికోస్ అనే గ్రీకు పదం నుంచి వచ్చింది. ప్లాస్టికోస్ అంటే మలచడం అని అర్థం. ప్రమాదాలు, జన్మతః వచ్చిన వికారాలను వైద్యులు శస్త్రచికిత్స ద్వారా చూడచక్కని ఆకారం తెప్పించగలుగుతున్నారు. ఈ కారణంగానే ప్రస్తుతం ఈ వైద్య విభాగానికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తోంది. విరిగిన శరీర అవయవాన్ని పరిమిత సమయంలో తీసుకొస్తే వైద్యులు వెంటనే అతికించగలిగే ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. రెండు దశాబ్దాల క్రితం కర్నూలులో ఇద్దరే ప్లాస్టిక్ సర్జన్లు ఉండేవారు. వారిలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఒకరు పనిచేస్తుండగా, ప్రైవేటులో మరొకరు పనిచేసేవారు. ఈ కారణంగా ఎవరైనా ప్లాస్టిక్ సర్జరీ ఆపరేషన్ చేయించుకోవాలంటే నెలల తరబడి సమయం పట్టేది. ఇప్పుడు ప్లాస్టిక్ సర్జన్ల సంఖ్య బాగా పెరిగింది. ప్రభుత్వంతో పాటు ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ వీరి సంఖ్య గణనీయంగా మెరుగయ్యింది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రస్తుతం ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తున్నారు. దీంతో పాటు ఒక పీజీ సీటు కూడా ఉండటంతో ప్రస్తుతం ఏడాదికొక్కరు చొప్పున ముగ్గురు పీజీలు చదువుకుంటున్నారు. వీరు వైద్యవిద్యను అభ్యసిస్తూనే అదే సమయంలో రోగులకు చికిత్సనందిస్తున్నారు. ఈ కారణంగా ఇప్పుడు ఈ విభాగం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందింది. ఒకప్పటిలా ఇప్పుడు ఆపరేషన్‌కు నెలల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి లేకుండా కేవలం వారం, పదిరోజుల్లోనే సర్జరీ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రహణమొర్రి, పుట్టుకతో వచ్చే అంగవైకల్యాలను సరిచేయడం, ఫేషియల్ సర్జరీ, ట్రామా అండ్ మ్యాక్సిలో ఫేసియల్ ఫ్రాక్చర్స్, రీ కన్‌స్ట్రక్టివ్ సర్జరీ, కాస్మోటిక్స్, ముక్కు సర్జరీ, ముఖంపై గాయాలు, చేతిగాయాలకు చికిత్స, చర్మం వేయడం, ఫ్లాప్‌సర్జరీ, హైపోస్పేడియాసిస్, కాలిన గాయాలకు చికిత్స, గైనకోమాస్టియా (మగవారిలో పెరిగిన రొమ్ములను సరిచేయడం), రొమ్ము పెంచడం వంటి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు.



ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు

ఏటా వెయ్యి దాకా శస్త్రచికిత్సలు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగంతో పాటు దానికి అనుబంధంగా కాలిన రోగుల వార్డు కూడా ఉంది. కర్నూలు, నంద్యాలతో పాటు వైఎస్‌ఆర్ కడప జిల్లా, రాయచోటి, అనంతపురం, శ్రీసత్యసాయి, ప్రకాశం, కర్నాటకలోని బళ్లారి, రాయచూరు, తెలంగాణలోని మహబూబ్‌నగర్, గద్వాల జిల్లా వాసులూ ఇక్కడికే చికిత్స కోసం వస్తున్నారు. ఈ విభాగానికి ప్రస్తుతం సోమవారం నుంచి శుక్రవారం వరకు ఓపీ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వారంలో ఓపీకి 120 నుంచి 150 మంది చికిత్స కోసం వస్తున్నారు. దీంతో పాటు ప్రతి మంగళ, బుధ, శుక్ర, శనివారాల్లో ఆపరేషన్లు నిర్వహిస్తారు. దీంతో పాటు ప్రతిరోజూ ప్రమాదాల్లో గాయపడిన వారికి అవసరమైతే ప్లాస్టిక్ సర్జరీ ఆపరేషన్లు అత్యవసరంగా చేస్తుంటారు. ఇలా 2022లో కోవిడ్ కారణంగా 588 ఆపరేషన్లు మాత్రమే నిర్వహించగా 2023లో 906 ఆపరేషన్లు నిర్వహించారు.

అందుబాటులోకి నూతన భవనం

నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రీవెన్షన్ ఆఫ్ ది బర్న్ ఇన్‌జ్యూరీస్(ఎన్‌పీపీడీబీఐ) కింద కేంద్ర ప్రభుత్వం 2017 మార్చిలో రూ.4.5 కోట్ల ప్రాజెక్టును మంజూరు చేసింది. ఇందులో రూ.2.5 కోట్లను కేంద్రం, 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇటీవలే భవన నిర్మాణం పూర్తి కాగా వైద్యపరికరాలు రావాల్సి ఉంది. దీంతో పాటు ఈ విభాగానికి ఒక ప్లాస్టిక్ సర్జన్/బర్న్స్/జనరల్ సర్జన్, ఇద్దరు మత్తు వైద్యులు, నలుగురు మెడికల్ ఆఫీసర్స్, 12 మంది స్టాఫ్‌నర్సులు, ఒక ఓటీ టెక్నీషియన్, ఇద్దరు డ్రెస్సర్స్, ఇద్దరు మల్టీపర్పస్ రిహాబిటేషన్/సీబీఆర్ వర్కర్స్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, 12 మంది మల్టీపర్పస్ వర్కర్స్(నర్సింగ్ ఆర్డర్లీ/నర్సింగ్ అటెండెంట్స్/సఫాయి కర్మాచారి)లు అదనంగా నియమించాల్సి ఉంది.



ఆసుపత్రిలో ఇటీవల ప్రారంభమైన కాలిన రోగుల విభాగం

అత్యాధునిక పరికరాలతో వైద్యం



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో ఇప్పుడు హైదరాబాద్ స్థాయిలో పూర్తిస్థాయి వైద్యసేవలు అందిస్తున్నాం. ఒకప్పటిలా గాకుండా ఇప్పుడు అవసరమైతే ప్రతిరోజూ ఆపరేషన్లు నిర్వహించడమే గాక ఓపీ చూస్తున్నాం. ఆసుపత్రిలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం వైద్యులు ఉండటంతో పీజీ సీట్లు మంజూరు కావడంతో వైద్యుల సంఖ్య పెరిగింది. జాతీయ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం (నేడు) మెడికల్ కాలేజీ ఆవరణలోని శుశృతుడు విగ్రహానికి పూలమాల వేసి, అనంతరం క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో సెమీ సీఎంఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఇందులో నాలుగు అంశాలపై నిపుణులైన వైద్యులు ఆధునికంగా ప్లాస్టిక్ సర్జరీలో వచ్చిన మార్పుల గురించి వివరిస్తారు.

– డాక్టర్ ఎం. మంజులబాయి, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడీ, కర్నూలు ప్రభుత్వ వైద్యశాల

శాస్త్రోక్తంగా సుదర్శన హోమం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ: అహోబిల క్షేత్రంలో సుదర్శన మూర్తి జయంతి సందర్భంగా ఆదివారం శాస్త్రోక్తంగా సుదర్శన హోమాన్ని నిర్వహించారు. ముందుగా మూల మూర్తులు శ్రీ ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్లను సుప్రభాత సేవతో మేలుకొలిపి నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాద వరదస్వామి, శ్రీ సుదర్శన మూర్తులను కొలువుంచి నవకలశస్థాపన అనంతరం, పంచామృతాలతో అభిషేకించి తిరుమంజనం నిర్వహించారు. ఆ తర్వాత ఉత్సవమూర్తులను నూతన పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి కొలువుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉభయ దేవురులతో కొలువైన శ్రీ నృసింహస్వామి ఎదురుగా శ్రీ సుదర్శన మూర్తిని కొలువుంచి ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాలు, వేద పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ సుదర్శన హోమం శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతితో కార్యాక్రమాన్ని ముగించారు.



ఉత్సవమూర్తులకు హారతి ఇస్తున్న దృశ్యం

నేడు స్వాతి వేడుకలు..

స్వాతి నక్షత్రం సందర్భంగా సోమవారం దిగువ అహోబిలంలో ఉత్సవ మూర్తులకు తెల్లవారుజామున జేష్టాభిషేక వేడుకలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అభిషేకం, అర్చనలు, అనంతరం గరుడ సేవ ఉంటుంది.

కర్నూలులో బాలుడి కిడ్నాప్!

- మిస్సింగ్ కేసు కింద పోలీసుల దర్యాప్తు

కర్నూలు: కర్నూలులో ఐదేళ్ల బాలుడు షేక్ అబ్దుల్ రెహమాన్ కిడ్నాప్ ఘటన కలకలం రేపింది. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణం బొరుగుల బట్టీ వీధికి చెందిన బోయ సుంకన్న నంద్యాల టౌన్ లోని బొగ్గుల లైన్‌లో ఉన్న దూదేకుల షేక్ అమీనాను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పది రోజుల క్రితం భార్య, పిల్లలతో కలిసి సుంకన్న బతుకుదెరువు నిమిత్తం కర్నూలుకు వచ్చి చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవనం గడిపే వాడు. నగరంలోని ముఖ్య కూడళ్లలో తలదాచుకుంటూ ఉండేవాడు. శనివారం రాత్రి వర్షం పడుతున్నందున మద్దూర్‌నగర్‌కు ఎదురుగా ఉన్న ఠాగూరు నగర్ దగ్గరలోని రోడ్డు వద్ద హనీఫ్ హార్డ్‌వేర్ దుకాణం వద్ద భార్య, బిడ్డలతో కలిసి నిద్రిస్తున్నాడు. ఆదివారం ఉదయం నిద్ర లేచే సరికి చిన్న కుమారుడు షేక్ అబ్దుల్ రెహమాన్ (5) కనిపించకపోవడంతో చుట్టు పక్కల కాలనీలలో గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం సాయంత్రం పోలీసులను ఆశ్రయించాడు. వారు నిద్రించిన దుకాణాల వద్ద సీసీ కెమెరాలు పరిశీలంచగా తెల్లవారు జామున ఆటోలో ఇద్దరు వ్యక్తులు వచ్చి బాలుడిని తీసుకొని వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అయితే తన కొడుకు తప్పిపోయాడని సుంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మూడవ పట్టణ సిఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

జిల్లాను టూరిజం హబ్‌గా మారుస్తాం

నంద్యాల(సెంట్రల్): నంద్యాల చుట్టూ ఉన్న శైవ క్షేత్రాలలను అభివృద్ధి చేసి జిల్లాను టూరిజం హబ్‌గా మారుస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం ఆయన రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాతో కలిసి స్థానిక చిన్న చెరువు టూరిస్ట్ రెస్టారెంట్, పార్కును సందర్శించారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో రాబోయే రోజుల్లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామన్నారు. అటవీ, దేవదాయ, పర్యాటక శాఖలు సంయుక్తంగా సమీకృత ప్రణాళిక తయారుచేసి అభివృద్ధి చేస్తామన్నారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ చెరువు వద్ద పార్కును అభివృద్ధి చేసి ఆకర్షించే రీతిలో అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. పార్కులో రెస్టారెంట్ బిల్డింగ్ పునర్నిర్మాణ పనులు, చిన్నపిల్లల ఆట వస్తువులు, జిమ్, ల్యాండ్ స్కేపింగ్, వాకింగ్ ట్రాక్, చెరువు చుట్టూ ఫెన్సింగ్, ఫుడ్ కౌంటర్ తదితర ఏర్పాట్లన్నీ బాగున్నాయన్నారు. బోటింగ్ చేసేందుకు వీలుగా మోటార్ బోట్లు, పెడల్ బోట్ల నిర్వహణను మంత్రి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో జిల్లా పర్యాటకంగా అభివృపై పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆసియాలోనే రెండవ అతి పొడవైన బెలూం గుహలు, వాల్మీకి గుహలు తదితర ప్రదేశాలన్నింటిని మరింతగా తీర్చిదిద్దుతామన్నారు. శ్రీశైలంలో 79 గదులతో ఉన్న రెస్టారెంట్‌ను ఆధునీకీకరించడంతో పాటు, 42 కొత్త గదులను 14.85 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. మహానందిలో 31 గదులతో, అహోబిలంలో 8 గదులతో రెస్టారెంట్ సౌకర్యం ఉందన్నారు. అహోబిలంలో మరో 31 కొత్త గదులు, 4 డార్మెటరీలు ఐదు కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అహోబిలం దేవాలయాన్ని సీడీబీటీ నిధులతో అభివృద్ధి చేసేందుకు 2.5 కోట్లు విడుదల చేశారన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఆర్‌డీఓ మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నంద్యాలలో టూరిజం పార్కును సందర్శిస్తున్న మంత్రులు దుర్గేష్, ఫరూక్

సూపర్ సిక్స్‌ను విస్మరిస్తే ప్రజా పోరాటం

బొమ్మలసత్రం: సూపర్ సిక్స్ అంటూ ఓట్లు దండుకున్న సీఎం చంద్రబాబు ఇప్పుడు హామీలను విస్మరిస్తే ప్రజా పోరాటం చేస్తామని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా హెచ్చరించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అమలు చేసిన అమ్మ ఒడి పథకాన్ని చంద్రబాబు తల్లికి వందనం పేరు మార్చి ఎంత మంది పిల్లలు ఉన్నా ప్రతి ఒక్కరికీ రూ.15 వేలు ఇస్తానని ప్రజలను నమ్మించారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లికి మాత్రమే రూ. 15 వేలు ఇస్తామనడం చంద్రబాబు కుటిల బుద్ధికి నిదర్శమన్నారు. పథకాలు అమలు చేయకుండా జాప్యం చేయడం సమంజసం కాదన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం సంక్షేమ క్యాలెండర్‌ను ఏటా అమలు చేసిందని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించిందన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో ప్రజలతో కలసి ఆందోళనలు చేస్తామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

స్పోర్ట్స్ బైక్ ఢీకొని తాపీ మేస్త్రి దుర్మరణం

కర్నూలు: రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో తాపీ మేస్త్రి ముని స్వామి (55) అక్కడికక్కడే మృతి చెందారు. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం పక్కన ఉన్న మద్యం దుకాణం వద్ద నుంచి శరీన్‌నగర్‌లోని తన ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండా గుత్తి పెట్రోల్ బంక్ వైపు వెళుతున్న స్పోర్ట్స్ బైక్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దాదాపు తొమ్మిది అడుగులు గాలిలోకి ఎగిరి కింద పడటంతో తల పగిలి అక్కడికక్కడే మునిస్వామి మృతి చెందారు. ఈయన భార్య ఎలిజబెత్ రాణి పుట్టినిళ్లు తెలంగాణ రాష్ట్రం అలంపూర్ తాలుకా మానవ పాడు మండలం శ్రీనగర్. గత 13 ఏళ్లుగా పిల్లలు వంశీ, మధుమతితో కలిసి అక్కడే ఉంటున్నారు. మునిస్వామి మాత్రం కర్నూలులో ఉంటూ అప్పుడప్పుడు కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి వచ్చేవాడు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు తెలియగానే కుటుంబ సభ్యులు హుటాహుటిన కర్నూలుకు చేరుకున్నారు. విషయం తెలిసిన వెంటనే ట్రాఫిక్ పోలీస్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన స్పోర్ట్స్ బైక్‌ను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదంపై ట్రాఫిక్ పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు.





మృతి చెందిన మునిస్వామి, ప్రమాదానికి కారణమైన స్పోర్ట్స్ బైక్

'చలో ముచ్చుమర్రి'ని అడ్డుకున్న పోలీసులు

- కేజీ రోడ్డుపై వాల్మీకి, ప్రజా సంఘాల ఆందోళన
- హోంమంత్రి, డిప్యూటీ సీఎం తీరుపై ఆగ్రహం

నందికొట్కూరు: బాలిక అదృశ్యం కేసు దర్యాప్తులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ వాల్మీకి, ప్రజా సంఘాలు చేపట్టిన చలో ముచ్చుమర్రి కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ముచ్చుమర్రి వెళ్లేందుకు ఆదివారం నందికొట్కూరు చేరుకున్న ఆయా సంఘాల నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో స్థానిక పటేల్ సెంటర్ నుంచి పోలీసు స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీసు స్టేషన్ ఎదుట కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై బైఠాయించి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. సీఎం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, హోంమంత్రి అనిత డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎనిమిది రోజులైనా బాలిక ఆచూకీని గుర్తించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులికొండ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజుల్లోనే రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయన్నారు. మహిళలు, బాలికలకు రక్షణ కరువైందన్నారు. హోం మంత్రి అనిత ముచ్చుమర్రి సంఘటనపై ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. న్యాయవాది చంద్రాచారి, సామాజిక కార్యకర్తలు నాగభూషణం, శ్రీధర్ మాట్లాడుతూ బాలిక కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. నిందితులకు శిక్ష పడకుండా హోంమంత్రి కొమ్ముకాస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు.



పటేల్ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వాల్మీకి సంఘం, ప్రజా సంఘాలు

'హద్దు'లు మీరి.. సాగుకు యత్నం!



ఫారెస్ట్ భూమిలో హద్దులు వేసిన దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి ఫారెస్ట్ భూములను తాము సాగు చేసుకుంటామని ఆదివారం ఉదయం బనవాసి, చుట్టు పక్కల గ్రామల ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారు. ముళ్ల పొదలను తొలగించి హద్దులు నిర్ణయించుకున్నారు. ఇక్కడ ఫారెస్ట్‌కు సంబంధించి 2 వేల ఎకరాల భూములు ఉన్నాయి. అయితే ఫారెస్ట్ భూములను నక్కలమిట్ట, పరమాన్‌దొడ్డి, వెంకటగిరి, బోడబండ, బనవాసి గ్రామాలకు చెందిన కొందరు సాగుచేసుకుంటున్నారు. బనవాసి గ్రామానికి చెందిన ప్రజలు తమ పొలిమేరలో ఉన్న ఫారెస్ట్ భూములను ఇతర గ్రామాల వారు ఎలా సాగు చేసుకుంటారని, తామే సాగు చేసుకుందామని పెద్ద సంఖ్యాలో ట్రాక్టరును తీసుకొని ఆదివారం ఉదయం అక్కడికి చేరుకున్నారు. ఒక్కొక్కరు కొంత భూమి తనకు అంటూ హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు సంఘటన స్థలం దగ్గరకు వచ్చి ముళ్ల పొదలు తొలగింపులను నిలుపుదల చేయటానికి ప్రయత్నించగా ప్రజలు అడ్డుకున్నారు. దీంతో రూరల్ పోలీసులను పిలిపించారు. తాము ఫారెస్ట్ భూములను అక్రమించుకోలేదని, సాగు చేసుకునేందుకు ముళ్లపొదలు తొలగిస్తున్నామని చెప్పారు. ''ఫారెస్ట్ భూములు సాగు చేస్తున్న వారందరూ కొలు చెల్లిస్తున్నారా? వారందరినీ తొలగించండి.. మేం వదలుతాం' అని వాదించారు. దీంతో పోలీసులు, ఫారెస్ట్ అధికారులు వెనుతిరిగి వెళ్లిపోయారు. ఈ విషయంపై బనవాసిఫారం డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్‌ను వివరణ కోరగా.. తాను సెలవులో ఉన్నానని, ఫారెస్ట్ భూములను ఇప్పటి వరకు ఎవరు సాగు చేస్తున్నా అందరి దగ్గరి నుంచి వెనక్కి తీసుకంటామన్నారు. భూములను ఆక్రమించుకుంటే ఊరుకునే ప్రసక్తి లేదని కేసులు పెడతామని హెచ్చరించారు.

ఓవరాల్ చాంపియన్ ఎన్టీఆర్ జిల్లా

- ముగిసిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ స్విమ్మింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): నగరంలోని కిసాన్ ఘాట్ వద్ద ఉన్న స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహిస్తున్న 9వ సబ్ జూనియర్, జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారులు 30 బంగారు, 21 వెండి, 14 కాంస్య పతకాలు సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్నారు. విశాఖపట్నం జిల్లా క్రీడాకారులు 10 బంగారు, 15 వెండి ,6 కాంస్య పతకాలతో రన్నర్ స్థానంలో నిలిచారు. కృష్ణ జిల్లా క్రీడాకారులు 14 బంగారు, 4 వెండి, 7 కాంస్య, చిత్తూరు జిల్లా క్రీడాకారులు 6 బంగారు, 9 వెండి , 12 కాంస్య పతకాలు సాధించారు. వ్యక్తిగత పోటీల్లో బి. బాలుర విభాగంలో తిరుభువన్ రెడ్డి (వైఎస్‌ఆర్ కడప), ఎం. యజ్ఞసాయి (ఎన్టీఆర్ జిల్లా), సంపత్ కుమార్ యాదవ్ (కృష్ణ జిల్లా), బాలికల విభాగంలో యామర్తి పార్థవి (కృష్ణ జిల్లా), అవిగ్న లాస్య శ్రీ (బాపట్ల జిల్లా), పావని సరయూ (ఎన్టీఆర్ జిల్లా) విజేతలుగా నిలిచారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్న వారికి, వ్యక్తిగత ప్రతిభ చాటిన స్విమ్మర్లకు అతిథులుగా హాజరైన సెట్కూర్ సీఈఓ రమణ, వీఆర్ ఆసుపత్రి నిర్వహకులు వాసురెడ్డి బహుమతులు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్, కోశాధికారి రమేష్, ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, స్విమ్మింగ్ పూల్ కోచ్ నటరాజారావు, జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహయ్య, కార్యదర్శి జి. రామక్రిష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీతో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన ఎన్టీఆర్ జిల్లా స్విమ్మర్లు